క్లుప్తంగా

టీకాలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలి

గూడూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్‌ సెంటర్లలో టీకాలను పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని డీఎంహెచ్‌ఓ అంబరీష అన్నారు. బుధవారం మండలంలోని భూపతిపేట వెల్‌నెస్‌సెంటర్, అయోధ్యపురం పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణుల వివరాలు 12 వారాల్లో నమోదు చేయాలని, టీడీ వాక్సిన్లు ఇప్పించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వందశాతం టార్గెట్‌ పూర్తిచేయాలని సూచించారు. అసంక్రమిత వ్యాధులు బీపీ, షుగర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స అందించాలన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ ప్రత్యూష, డాక్టర్‌ మురళీధర్, సబ్‌ యూనిట్‌ ఆఫీసర్‌ శ్రీనివాస్, డీపీఎం రుక్ముద్దీన్‌ పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

దోర్నకల్‌: ఎన్నికల నేపథ్యంలో దోర్నకల్‌తోపాటు జిల్లా సరిహద్దులు, రైల్వే స్టేషన్‌లలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలోని రెండు చెక్‌పోస్టుల వద్ద పోలీసులు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

పోలీసుల గుప్పిట్లో ఏజెన్సీ



గస్తీ కాస్తున్న పోలీసులు

కొత్తగూడ: మండలంలోని అన్ని పోలింగ్‌ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది బుధవారం చేరుకున్నారు. సిబ్బంది ఉండేందుకు ఆయా పోలింగ్‌ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తహసీల్దార్‌ రమాదేవి, ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, ఇతర ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు. కొత్తగూడ మండలం మావోయిస్ట్‌ ప్రభావిత ప్రాంతం కావడంతో భారీగా కేంద్ర పోలీస్‌ బలగాలను మోహరించారు. అణువణువు తనిఖీలు చేస్తూ 144 సెక్షన్‌ పకడ్బందీగా అమలు చేస్తున్నారు. అడవుల్లో గ్రే హౌండ్స్‌ బలగాలు కూంబింగ్‌ నిర్వహిస్తుండగా, గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో ఎస్సై నగేష్, సెక్టోరల్‌ ఆఫీసర్‌ తౌహార్‌ బాబాలు గస్తీ తిరుగుతున్నారు.

కేసు నమోదు

గార్ల: మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన జి.మహేష్‌ కాపుసారా విక్రయిస్తుండగా అతని వద్ద నుంచి 15 లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్‌ వెంకన్న బుధవారం తెలిపారు.

పోలింగ్‌ సామగ్రి పంపిణీ



మహబూబాబాద్‌: జిల్లా కేంద్రంలోని టీఎస్‌ డబ్ల్యూఆర్‌ఎస్‌ పాఠశాలలో బుధవారం మానుకోట నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్‌ సామగ్రి పంపిణీ చేశారు. ఆర్వో, ఆర్డీఓ అలివేలు సమక్షంలో 16కౌంటర్లు ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బందికి సామగ్రి అందజేశారు. కాగా 283 పోలింగ్‌ కేంద్రాలకు గానూ 283 పీఓలు, 283 ఏపీఓలు, 566 ఓపీఓలు, అదనంగా 228 సిబ్బందితో కలిపి 1,360మంది సిబ్బంది పోలింగ్‌ విధులు నిర్వహిస్తారని ఆర్వో తెలిపారు. 32రూట్‌లకు 32మంది రూట్‌ ఆఫీసర్లు, 32మంది సెక్టార్‌ ఆఫీసర్లు, 32 బస్సులను కేటాయించి బందోబస్తు నడుమ పోలింగ్‌ సామగ్రిని కేంద్రాలకు తరలించినట్లు ఆమె చెప్పారు.

పోలింగ్‌ కేంద్రంలో అసౌకర్యాలు

మహబూబాబాద్‌ అర్బన్‌: మహబూబాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లిలో 2, 3 వార్డులు కలుపుకుని సుమారు 3040 ఓట్లు ఉండగా ఆ ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలలో అక్కడి ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఆ పరిధిలో 253, 254, 256 పోలింగ్‌ బూతులు ఉన్నాయి. ఈ పాఠశాలలో గతంలో మరుగుదొడ్లను కాంట్రాక్టర్లు తొలగించి నూతన మరుగుదొడ్లను నిర్మిస్తామని నేటికి నిర్మాణం చేపట్టకపోవడంతో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైమరీ పాఠశాలలో ఒక మరుగుదొడ్డి ఉండగా మహిళా ఉపాధ్యాయులు, బాలికలు అదే మరుగుదొడ్డిని వినియోగిస్తున్నారు. నేడు సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇక్కడే ఓటు హక్కు వినియోగించుకునే ప్రజలు, అధికారుల పరిస్థితిపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉందని ఓటర్లు తెలుపుతున్నారు.

‘అసెంబ్లీ’ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



సంగెం: తిమ్మాపూర్‌ గ్రామానికి ఈవీఎంలతో చేరుకున్న ఎన్నికల సిబ్బంది



దుగ్గొండి: నాచినపల్లి పోలింగ్‌ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది



సంగెం: కుంటపల్లికి ఈవీఎంలతో చేరుకున్న ఎన్నికల సిబ్బంది

● పోలింగ్‌ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

ఖానాపురం : సాధారణ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శాసనసభ ఎన్నికల కోసం పోలింగ్‌ స్టేషన్లకు ఎన్నికల అధికారులు ఈవీఎం, వీవీప్యాట్‌లతో ఇప్పటికే చేరుకున్నారు. మండలంలో 30 పోలింగ్‌ స్టేషన్లను ఏర్పాటు చేయగా 120 మంది ఎన్నికల సిబ్బందిని కేటాయించారు. తహసీల్దార్‌ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ సుమణవాణిల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వీరితో పాటు సీఐ పుల్యాల కిషన్, ఎస్సై మాధవ్‌ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఎన్నికల నిర్వహణ చేపట్టనుండగా ఐదు లోపు పోలింగ్‌ స్టేషన్లలో ఉన్న ఓటర్లకు మాత్రమే ఓటు వేయడానికి అనుమతించనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలి

సంగెం : ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతమైన వాతావరణంలో వినియోగించుకునేలా పోలింగ్‌ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత నిర్వహించాలని సీఐ మల్లయ్య, సంగెం ఎస్సై ఎం.భరత్‌ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు బందోబస్తు నిర్వహించే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ఓటర్లకు డబ్బు, మద్యం ఇతరాలు పంచితే వెంటనే సీ-విజిల్‌ యాప్‌లో అప్‌లోడ్‌ చేయాలని లేదా డయల్‌ -100కు సమాచారం అందించాలన్నారు. మండలంలో 44 పోలింగ్‌ కేంద్రాల పరిధిలో 40,224 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. భద్రత కోసం సీఐ, ఇద్దరు ఎస్సైలతో పాటుగా 32 మంది బీఎస్‌ఎఫ్, 30 మంది ఒరిస్సా మిగిలిన వారు స్థానిక, బెటాలియన్‌ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారన్నారు.



సంగెం పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న సీఐ మల్లయ్య



ఖానాపురం: అశోక్‌నగర్‌కు చేరుకున్న పోలీస్‌ అధికారులు

పోలింగ్‌ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు

మండలంలో 30 లోకేషన్లలో 16 సింగిల్, 14 రెండు చొప్పున పోలింగ్‌ బూత్‌లున్నాయి. వీటిలో 176 మంది పోలింగ్‌ సిబ్బంది ఈవీఎంలతో పోలింగ్‌ కేంద్రాలకు చేరుకున్నారు. బుధవారం సాయంత్రం పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు పీఓ, ఏపీఓ ఇతర సిబ్బంది పూర్తి చేసుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి

చెన్నారావుపేట : నేడు(గురువారం) జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి ఫణికుమార్‌ బుధవారం తెలిపారు. చెన్నారావుపేట మండలంలో 31,273వేల మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే ఈవీఎంలు, వీవీప్యాట్‌లు ఎన్నికల అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశామని, వాటిని పోలీసు భద్రతతో ప్రత్యేక వాహనాలలో గ్రామాలకు తరలించామన్నారు. గ్రామాల్లోని ఓటర్లు తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని సూచించారు. 144సెక్షన్‌ అమలులో ఉంటుందని, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, ఓటర్లు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. పోలీస్‌ బందోబస్తును ఏర్పాటు చేశామని, ఎలాంటి గొడవలు, అల్లర్లు జరిగినా శాఖ పరమైన చర్యలు తప్పవని చెన్నారావుపేట ఎస్సై తోట మహేందర్‌ హెచ్చరించారు.

పోలింగ్‌ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు

దుగ్గొండి : నేడు(గురువారం) జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అధికారులు అంతా సిద్ధం చేశారు.మండల పరిధిలోని 34 గ్రామ పంచాయతీల్లో 49 పోలింగ్‌ కేంద్రాలు ఉండగా 36,276 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్‌ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్‌ సౌకర్యం, ర్యాంపులను సైతం ఏర్పాటు చేశారు. పోలింగ్‌ కేంద్రాల ప్రాంగణంలో సీసీ కెమెరాలు బిగించి, శాంతిభద్రలతకు ఎలాంటి భంగం కలగకుండా 200 మంది సీఆర్పీఎస్‌ జవాన్లతో బందోబస్తు సిద్ధం చేసినట్లు ఎస్సై పరమేశ్‌ తెలిపారు. పోలింగ్‌ సందర్భంగా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన తెలిపారు.



చెన్నారావుపేటలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రం



చెన్నారావుపేట: గ్రామాలకు వెళ్తున్న పోలీసులు



సంగెం మండల కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

వలంటీర్లుగా విద్యార్థులు



ఎంపికైన ఉప్పరపల్లి పాఠశాల విద్యార్థులు

చెన్నారావుపేట : నేడు(గురువారం) జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు సేవలందించేందుకు విద్యార్థులను వలంటీర్లను ఎన్నికల కమిషన్‌ కేటాయించింది. వృద్ధులకు, దివ్యాంగుల ఓటర్లకు తగిన సహాయం చేయడానికి వలంటీర్లను నియమించింది. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌ నుంచి చెలకలపల్లి సిద్దార్థ, ప్రభాస్, నిక్సన్, మురళీకృష్ణలను వలంటీర్లుగా తీసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. వృద్ధులు, ఇతర అవసరాలు గల ఓటర్ల సహాయార్థం వలంటీర్లుగా పని చేయడం తమ జీవితంలో మర్చిపోలేమని అన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



రంగవల్లులతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న యువతులు

వర్ధన్నపేట : ఓటు హక్కు కలిగిన వారంతా నేడు (గురువారం) తమ ఓటును విధిగా వినియోగించుకుని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు భార్గవి, నవ్య తెలంగాణ సంస్కృతీలో భాగమైన రంగవల్లులు వేసి ప్రజలకు చక్కటి సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. ఐదేళ్ల కాలానికి ఒక మంచి సమర్ధవంతమైన నాయకుడిని ఎన్నుకునేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. ముఖ్యంగా ఈ సారి 10 లక్షల మంది యువత కొత్తగా ఓటు హక్కు పొందారన్నారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన మహిళలు సమ్మక్క, రజిత, రజని, నళిని, విజయ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

నగదు స్వాధీనం

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో బీఆర్‌ఎస్‌ నాయకులు డబ్బులు పంచుతుండగా బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ అధికారి శ్రీధర్‌రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ గ్రామ అధ్యక్షుడు దోని రామచంద్రు ఇంటి వద్ద బోడ సురేష్‌ ఓటర్లకు డబ్బులు పంచుతున్నాడు. సమాచారం మేరకు ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి రూ. 22,500 నగదుతోపాటు 38 కుర్చీలు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గ్రామస్తుల సమక్షంలో పంచనామా నిర్వహించినట్లు పేర్కొన్నారు. కానిస్టేబుల్‌ క్రాంతికుమార్, రమేష్, యాకయ్య, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, రాజ్‌కుమార్, బీఎల్‌ఓలు కవిత, సరిత, కారోబార్‌ కరెడ్ల రాజు తదితరులు ఉన్నారు.



పంచనామా నిర్వహిస్తున్న అధికారులు

వెంకటాపురంలో రూ.1.50 లక్షలు పట్టివేత

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఓ పార్టీకి సంబంధించిన కార్యకర్తల నుంచి రూ.1.50 లక్షల నగదును ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఓటర్లకు పంపిణీ చేస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

చెన్నారావుపేట : రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలైన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సునీత ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా నర్సంపేట నుంచి మహబూబాబాద్‌ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. సునీతకు గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ఆర్థికసాయం

దామెర: మండలంలోని ఒగ్లాపూర్‌ గ్రామానికి చెందిన సిలువేరు రాధ, మల్లయ్య దంపతుల కుమార్తె హిమప్రియ వివాహానికి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి చేయూతనిచ్చారు. పుస్తె మట్టెల కోసం రూ. 10,000 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు సుజాత, దామెర రజిని, గ్రామస్తులు కిన్నెర రామస్వామి, కీసరి రమేష్, కిన్నెర రమేష్, పోరల సతీష్‌కుమార్, శంకర్, కిన్నెర లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

వీడియో వైరల్‌!

పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే ఓ పార్టీ కార్యకర్త అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే అభ్యర్థికి ఫోన్‌ చేసి డబ్బులు సరిగా పంచడం లేదని చెప్పిన వీడియో సోషల్‌ మీడియాలో బుధవారం వైరల్‌గా మారింది. అభ్యర్థి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

‘విద్యాసంస్థల దగ్గర వైన్స్‌లు వద్దు’

సంగెం : విద్యాసంస్థల సమీపంలో వైన్స్‌ షాపులను ఏర్పాటు చేయవద్దని సంగెం మండల కేంద్రంలోని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈమేరకు పలువురు గ్రామస్తులు బుధవారం కలెక్టర్‌కు, వర్ధన్నపేట ఎక్సైజ్‌ సీఐ స్వరూపకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంగెం మండల కేంద్రానికి మంజూరైన 49, 50 షాపులను గతంలో కుంటపల్లి రోడ్డులో నిర్వహించేవారు. ఈ ఏడాది వాటిని అక్కడ కాకుండ సంగెం పెట్రోల్‌ బంకు పక్కన ఏర్పాట్లు చేస్తున్నారన్నారని తెలిపారు. అక్కడ విద్యాసంస్థలతోపాటు ఒక చర్చి కూడా ఉందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధగా వైన్స్‌ ఏర్పాటు చేయవద్దని మెట్టుపల్లి రమేష్, పవన్‌ కార్తీక్, అశోక్, హరీష్, శంకర్, వంశీ, ఎల్లయ్య, రవి, శ్రీనివాస్‌ తదితరులు అధికారులను కోరారు. ఈ విషయపై వర్ధన్నపేట ఎక్సైజ్‌ సీఐ స్వరూపను ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా స్పందించలేదు.

కొనసాగుతున్న మహా అన్నదానం

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్‌ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజా మహోత్సవం బుధవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శింగిరికొండ వేణుగోపాల్‌గుప్తా, మేర్గు స్వామి, మామిండ్ల రమేష్, కటకం అజయ్, వాంకుడోత్‌ రాజేందర్, ఐత సత్తయ్య, అజ్మీరా శంకర్‌ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖరం, దొడ్డ రవీందర్, శ్రీరాంతఈశ్వరయ్య, శంకరయ్య, భూపతి రాజశేఖర్, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాతలు

ఎయిడ్స్‌ను తరిమికొడదాం



ఎయిడ్స్‌ లోగో ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

నెక్కొండ : ఎయిడ్స్‌ వ్యాధిని పూర్తిగా నివారించడానికి సమష్టి కృషి చేయాలని సర్వోదయ యూత్‌ ఆర్గనైజేషన్‌ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రేణుక అన్నారు. మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల పాఠశాలలో బుధవారం సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్‌ 1న నిర్వహించనున్న ప్రపంచ ఎయిడ్స్‌ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఎయిడ్స్‌ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎయిడ్స్‌ రోగుల పట్ల వివక్ష చూపకూడదని అన్నారు. మందులేని ఎయిడ్స్‌కు నివారణే మార్గమని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్‌ చల్లా నాగార్జున్‌రెడ్డి, డైరెక్టర్‌ చల్లా పారిజాతం, ప్రిన్సిపాల్‌ మహ్మద్‌ షరీఫ్, సంస్థ సభ్యులు లక్ష్మి, విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చెస్‌ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



సూర్యప్రతాప్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వర్ధన్నపేట: మండలంలోని ఉప్పరపల్లి క్రాస్‌ రోడ్డు వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కోటి సూర్యప్రతాప్‌ రాష్ట్రస్థాయి చెస్‌ అండర్‌-14 విభాగంలో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్‌ సాధించాడని పాఠశాల ప్రిన్సిపాల్‌ రాజేంద్రచారి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పీఈటీ సందీప్, సూర్యప్రతాప్‌ను ప్రిన్సిపాల్‌ రాజేంద్రచారి, ఉ పాధ్యాయులు,విద్యార్థులు అభినందించారు.

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్‌ పోలీసుల దాడి



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

రాయపర్తి : మండలకేంద్రంలో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు వర్ధన్నపేట ఎక్సైజ్‌ ఎస్సై సువర్ణ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం బాటిళ్లను నిల్వ చేయగా సమాచారం మేరకు దాడులు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం విక్రయించినట్లెతై చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్‌ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మద్యం ధరలకు రెక్కలు

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల్లో మద్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ఎన్నికల దృష్ట్యా మద్యం షాపులు సీజ్‌ కావడంతో బెల్టుషాపుల జోరు కొనసాగుతుంది. ఎన్నికల ముందు కొన్నిరోజులు ఎక్సైజ్‌ అధికారులు బెల్ట్‌షాపులను బంద్‌ చేయించి చివరకు విచ్చలవిడిగా వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందుగానే అంచనా వేసుకున్న బెల్టు షాపుల యజమానులు భారీగా మద్యం బాటిళ్లను డంప్‌ చేసుకున్నట్లు సమాచారం. షాపులో ఉన్న ధరతో పోలిస్తే రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు మద్యం ప్రియులు పేర్కొన్నారు. బెల్టు షాపుల యజమానుల వద్ద ఎక్సైజ్‌ అధికారులు డబ్బులు తీసుకుని చూసీచూడనట్లు ఉంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.

యజమాని మృతికి కన్నీళ్లు కార్చిన శునకం

కేసముద్రం: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతిచెందగా, అతడి మృతదేహం వద్ద పెంచుకుంటున్న శునకం దీనంగా తిరుగుతూ, కన్నీళ్లు కార్చి తన విశ్వాసాన్ని చాటుకున్న సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. కేసముద్రంస్టేషన్‌లోని సంతోష్‌నగర్‌కాలనీకి చెందిన బొంపల్లి చిన్ని(38)అనే వ్యక్తి కొంతకాలంగా శునకాన్ని పెంచుకుంటున్నాడు. అతడు ఎంతో ప్రేమగా పెంచుకునే శునకం అతడి వెంటే వెళ్లేది. ఈక్రమంలో అనారోగ్యానికి గురై యజమాని మృతిచెందాడు. దీంతో యజమాని మృతదేహం వద్ద శునకం తిరుగుతూ, కాళ్లపై పడుకుంటూ, ముఖం వద్దకు వెళ్లి తడుముతూ యజమానిపై తన ప్రేమను చూపింది. కుక్క విశ్వాసాన్ని చూసిన వారి హృదయాలు బరువెక్కాయి.



యజమాని మృతదేహం వద్ద దీనంగా శునకం

సిద్ధమైన మోడల్‌ పోలింగ్‌ కేంద్రాలు

మహబూబాబాద్‌ అర్బన్‌: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవడానికి జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా మహిళా ఆదర్శ పోలింగ్‌ కేంద్రం, దివ్యాంగుల ఆదర్శ పోలింగ్‌ కేంద్రం బుధవారం ఏర్పాటు చేశారు. ప్రశాంతమైన వాతారవణంలో మహిళలు దివ్యాంగులు తమ ఓటును వినియోగించుకోవడానికి ఎన్నికల అధికారులు పోలింగ్‌ కేంద్రాలను అలంకరించి ముగ్గులతో స్వాగతం పలుకుతున్నారు. పత్తిపాక గిరిజన ఆశ్రమ పాఠశాలలో మహిళా ఆదర్శ పోలింగ్‌ కేంద్రం, ఆర్టీసీ బస్టాండ్‌ గుమ్ముడూరు ప్రభుత్వ పాఠశాలలో ఆదర్శ పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేడు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు ఓటు వినియోగించుకోవాలని ఓటర్లను అధికారులు కోరుతున్నారు.

నిజాయితీగా ఓటు వేయాలి

దుగ్గొండి : శాసనసభ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా నేడు(గురువారం) ఎన్నికలు జరగనున్నాయి. 283 పోలింగ్‌ బూత్‌లు ఉండగా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామపరిధిలో 1వ నంబర్‌ బూత్‌ ఉంది. అందులో తొలిఓటరుగా మిట్టపల్లి గణపతి పేరు నమోదయింది. నియోజకవర్గంలో తొలి ఓటరుగా ఓటు హక్కును గణపతి వినియోగించుకోనున్నాడు. గణపతి బీటెక్‌ పూర్తి చేసి ఆరు నెలల పాటుగా సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తొలిఓటరు తన పేరు నమోదు కావడం చాలా సంతోషంగా ఉందన్నాడు. నూతన ఓటరుగా విద్యావంతుడిగా తాను తెలంగాణ సమగ్రాభివృద్ధితో పాటు నిరుపేదల సంక్షేమం, యువతకు ఉపాధి, ఉద్యోగాలు, నీతి, నిజాయితీగల అభ్యర్థులకు మద్దతు పలుకుతానన్నారు. తొలిఓటరుగా తాను ఓటు వినియోగించుకుంటున్న తరుణం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఓటు వజ్రాయుధమని దానిని ప్రలోభాలకు, డబ్బులకు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా సమాజంలోని ప్రతి వ్యక్తి నిజాయితీగా, నిర్భయంగా ఓటు వేయాలని ఆయన సూచించారు.